క్లుప్తంగా

గిరిజన ఏరియాలోనే జీడి పరిశ్రమ స్థాపించాలి

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న జీడిపిక్కల పరిశ్రమను గిరిజన ఏరియా(ప్రాంతం)లోనే ఏర్పాటు చేయాలని ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం అధ్యక్షుడు ఆరిక చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 64 ఎకరాల్లో జీడితోటల సాగు ఉండగా, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, కొమరాడ మండలాల్లో 56 వేల ఎకరాల్లో జీడితోటల సాగు చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో పంట ఉత్పత్తి అయిన చోటే జీడిపిక్కల ఫ్యాక్టరీ ఉంటే రవాణా ఖర్చు రైతులకు తగ్గుతుందన్నారు. మైదాన ప్రాంతంలో పరిశ్రమ ఏర్పాటు చేస్తే గిరిజన ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో పాటు పంట దళారులపాలవుతుందన్నారు.

నేత్ర శస్త్రచికిత్సకు ఆరుగురి ఎంపిక



గుమ్మలక్ష్మీపురం: మండలంలోని తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విజయనగరానికి చెందిన పుష్పగిరి కంటి ఆస్పత్రి సిబ్బంది ఉచిత నేత్ర వైద్యశిబిరం మంగళవారం నిర్వహించారు. శిబిరానికి హాజరైన 50 మంది కంటి రోగులకు తనిఖీలు నిర్వహించి, వారిలో వివిధ సమస్యలతో బాధపడుతున్న ఆరుగురిని నేత్ర శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయనున్నట్లు సమాచారం. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి బుద్ధేశ్వరరావు, సీహెచ్‌వో పి.పద్మ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం



వాలీబాల్ టోర్నీ ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

పాలకొండ రూరల్: మండలంలోని తంపటాపల్లి గ్రామానికి చెందిన గ్రామ వలంటీరు బొమ్మాళి శ్రీనివాస్ జ్ఞాపకార్థం వారి కుటుంబీకులు, గ్రామ యువత, అక్కడి క్రీడాకారుల నేతృత్వంలో ఉత్తరాంధ్ర వాలీబాల్ టోర్నీ మంగళవారం ప్రారంభించారు. ఈ క్రీడలు మూడు రోజుల పాటు డే అండ్ నైట్ నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. తొలి రోజు గ్రామానికి చెందిన పలువురు నాయకులు చందక జగదీష్‌కుమార్, వంజరాపు ఈశ్వరరావు, జాడ శ్రీధర్, అల్లు సురేష్‌కుమార్ తదితరులు ఈ క్రీడలను ప్రారంభించారు. ప్రథమ బహుమతి విజేతలకు రూ.30వేలు, ద్వితీయ బహుమతి రూ.20, తృతీయ బహుమతి విజేతలకు రూ.10వేలు అందించనున్నారు.

సర్వేలు వేగవంతం చేయండి



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీవో రమేష్

జియ్యమ్మవలస: మండలంలోని గవరమ్మపేట సచివాలయాన్ని ఎంపీడీవో ఎస్.రమేష్ మంగళవారం సందర్శించారు. గ్రామంలో చేపడుతున్న సర్వేలను వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. అలాగే సిబ్బంది సమయానికి విధులకు హాజరై, ప్రజలకు అవసరమైన పౌరసేవలు సక్రమంగా అందించాలని తెలిపారు. అనంతరం అదే గ్రామంలోని పాఠశాలకు వెళ్లి, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, ఉపాధ్యాయుల బోధన, మధ్యాహ్న భోజన పథకం అమలును తనిఖీ చేశారు.

చెట్ల నరికివేత ఘటనపై విచారణ

జియ్యమ్మవలసరూరల్: మండలంలోని పెదబుడ్డిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణానికి అడ్డుగా ఉన్నాయని నరికివేసిన చెట్లపై డిప్యూటీ ఈవో పి.కృష్ణమూర్తి మంగళవారం విచారణ చేపట్టారు. మొత్తం 63 చెట్లు నరికేశారని, ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. చెట్లు నరికే సమయంలో తాను అక్కడ లేనని ప్రధానోపాధ్యాయుడు సమాధానమిచ్చారు. ఆరోజు అక్కడ లేకపోతే జరిగిన సంఘటనపై పోలీసులు, అధికారులకు ఎందుకు ఫిర్యాదు చేయలేదని గ్రామస్తులు హెచ్‌ఎంను నిలదీశారు. దీనిపై సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తానని డిప్యూటీ ఈవో తెలిపారు.

నేడు విగ్రహ ప్రతిష్ఠ

భామిని: మండలంలోని బాలేరు గ్రామంలో వంశధార నదీతీరాన నిర్మించిన గ్రామదేవత మందిరంలో యోగనిద్రలో ఉన్న మహాశివుని, గ్రామ దేవత విగ్రహాలను బుధవారం ప్రతిష్ఠించనున్నారు. ఆలయ నిర్వాహకులకు దీనికి సంబంధించి ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా మూడు రోజుల పాటు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

● చిన్నారులతో ఎంపీడీఓ మాటామంతి



పాఠశాల, అంగన్‌వాడీ చిన్నారులతో సీతంపేట ఎంపీడీఓ కె.గీతాంజలి మమేకమయ్యారు. సీతంపేట మండలంలోని కారిమానుగూడ ప్రభుత్వ పాఠశాలను, కుడ్డపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులతో మాటామంతి కలిపారు. కొందరు విద్యార్థులతో బోర్డుపై గణితం సాధన చేయించారు. కారిమానుగూడ పాఠశాలలో చిన్నారులకు స్వయంగా ఆమె మధ్యాహ్న భోజనం వడ్డించారు. కుడ్డపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో సరదాగా గడిపారు. అనంతరం ఎగువ కారిమానుగూడలో సీసీ రోడ్డు పనులను పర్యవేక్షించారు. గ్రామ సచివాలయంలో జరుగుతున్న జీఎస్‌డబ్ల్యూఎస్ సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆధార్ నమోదు కాని చిన్నారులను వెంటనే అప్‌డేట్ చేయించాలని సూచించారు.

– సీతంపేట

నిబంధనలు పాటించాల్సిందే..



వాహన చోదకులు రోడ్డు ప్రమాదం అధిగమించే క్రమంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ ప్రయోగమూర్తి స్పష్టం చేశారు. మంగళవారం పాలకొండ – వీరఘట్టం, విశాఖ, సీతంపేట రహదారుల్లో ముమ్మర వాహన తనిఖీలు నిర్వహించారు. ఇదే క్రమంలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను చేపట్టారు. సరైన వాహన ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు లేని వారి నుంచి అపరాధ రుసుం వసూళ్లు చేశారు. మైనర్లకు వాహనాలు నడిపేందుకు ఇవ్వడం ద్వారా ప్రమాదాలు సంభవిస్తే వాహన యజమానిపై కేసు నమోదు చేయాల్సి వుంటుందన్నారు.

–పాలకొండ రూరల్

● మాజీ ఎమ్మెల్యే కళావతి పరామర్శ



మండలంలోని బంజారుగూడకు చెందిన ఎస్.సోమయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబ సభ్యులను పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి మంగళవారం పరామర్శించారు. కుటుంబాన్ని అన్నివిధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎస్.లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.మహేష్, చలపతి తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట

సస్యరక్షణతో మంచి దిగుబడులు

● మామిడిలో పిందె రాలుడు నివారణపై సూచనలు

పాలకొండ రూరల్: ప్రస్తుత సీజన్‌లో పువ్వు నుంచి పిందె దశకు చేరుకుంటున్న మామిడిలో సస్యరక్షణ అవసరమని ఉద్యానవన శాఖాధికారులు పేర్కొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 18 వేల హెక్టార్లలో మామిడి పిందె దశకు చేరుకుంటుంది. ఈ తరుణంలో సంబంధిత తోటల సాగులో నిమగ్నమైన రైతులు సరైన సస్య రక్షణ చర్యలు పాటించాలని, పిందె రాలడాన్ని నివారించే మెలకువలపై అవగాహన పెంచుకోవాలని సూచిస్తున్నారు.

తోటల్లో భూమి స్థితిగతులకు అగనుణంగా..

మామిడి తోటలు సాగులో ఉన్న రైతులు తమ తోటలో భూమి స్థితిగతులకు అనుగుణంగా పూత దశ నుంచి నీటి తడులు అందించాలి. తేలికపాటి తడులు క్రమం తప్పకుండా అందించటం వలన పూత సమర్థవంతంగా పిందె కడుతుంది. భూస్వభావంలో భాగంగా బరువు నేలలు, నీరు నిలుపుకునే నేలల్లో 20 నుంచి 25 రోజుల వ్యవధిలో నీరు అందిచాలి. డ్రిప్ ద్వారా అయితే ఒక్కో మొక్కలు వంద లీటర్ల నీరు అందిస్తే సరిపోతుంది. తడులు ఎక్కువైతే చిగురు పెరిగి రసం పీల్చే పురుగులతో సమస్యలు ఏర్పడే అవకాశం ఉంటుంది. ప్రస్తుత నెలలో వచ్చే పూత, పిందెను కాపాడేందుకు థయోమిథాక్స్‌మ్ 0.3 గ్రాములు, థయోఫినేట్ మిథైల్ 1 గ్రాము లీటరు నీటిలో కలిపి మొక్కకు పిచికారీ చేయటం ద్వారా లబ్ధి పొందవచ్చు. అలాగే అగ్రోమిన్ మ్యాక్స్ లేదా ఫార్ములా–4 వంటివి 5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయటం వలన పిందె నిలుపుకునే అవకాశాలు మెరుగుపడుతుంది. పిందె బఠాని గింజ దశ నుంచి వివిధ దశల్లో ఉన్నంత వరకు తేలికపాటి నీటి తడులు కొనసాగించాలి. తోట పూర్తిగా ఎండిన తరువాత నీటి తడులు అందించటం వలన ప్రయోజనం ఉండదని గుర్తించాలి.



మామిడిలో పూత దశ

పోషక లోపాలు అధిగమించేందుకు...

పిందె దశలో మొక్కలో పోషక లోపాలు అధిగమించేందుకు నీటి తడులు అందించే సమయంలో మొక్క వయసుకు అనుగుణంగా(10 ఏళ్ల చెట్టుకు) ఒక్కో చెట్టుకి కిలో యూరియా, కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ అందించాలి. దీని వలన మొక్కకు బలం చేకూరుతుంది. అలాగే సూక్ష్మ పోషకాలు కూడా అవసరం. మొక్క చుట్టూ మీటరు దూరంలో ట్రెంచ్ తవ్వి అందులో వీటిని వేయాలి. ముఖ్యంగా అధికారుల సూచనలతో జింక్ సల్ఫేట్, ఐరన్ సల్ఫేట్, మెగ్నీషియం సల్ఫేట్, బోరాక్స్ వంటి సూక్ష్మ పోషకాలను పావు కిలో లోపు అందించాల్సి ఉంటుంది. కాయ అభివృద్ధి దశలో పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు లీటరు నీటికి కలిపి అందించవచ్చు.

హార్మోన్ల సమతుల్యత కాపాడేందుకు..

సస్యరక్షణ చర్యలు చేపట్టినప్పటికి పిందె రాలుడు సంభవిస్తే హార్మోన్ల సమతుల్యత లోపంగా భావించాలి. దీనిని అధిగమించేందుకు 4.5 లీటరు నీటికి 1 మిల్లీ లీటరు వంతున ప్లానోఫిక్స్ కలుపుకుని పిచికారీ చేయాలి. మొక్కకు హార్మోన్లు అందించే సమయంలో ఇతర క్రిమి సంహార మందులతో కలపకుండా ప్రత్యేకంగా అందించాలి. పిందె బఠాని గింజ దశ నుంచి పెరుగుతున్న సమయాల్లో అధికారుల సూచనలతో ఈ మందులు అందించాలి. అలాగే చీడపీడలు నివారణపై కూడా దృష్టి పెట్టాలి.

– టి.అమరేశ్వరి, ఉద్యానవన శాఖాధికారిణి, పాలకొండ

శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

గరుగుబిల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు ఎంఈవో దత్తి అప్పలనాయుడు కోరారు. మంగళవారం జరిగిన తరగతులకు హాజరైన ఆయన శిక్షణార్థులను ఉద్దేశించి, మాట్లాడారు. చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల కోసం ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారం సక్రమంగా అందజేయాలన్నారు. గర్భిణులు రక్తహీనత బారినపడకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో–2 కొండలరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆర్.లక్ష్మి, డీఆర్పీలు పి.వెంకటనాయుడు, వి.ధనుంజయనాయుడు, కె.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇచ్చే శిక్షణా తరగతులను కోర్సు డైరెక్టర్, ఎంఈవో–2 శ్రీనివాసరావు మంగళవారం ప్రారంభించారు. జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఆరు రోజుల పాటు అంగన్‌వాడీలకు శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణలో నేర్పే అంశాలను చక్కగా నేర్చుకుంటే కేంద్రాల్లోని చిన్నారులకు సులభంగా విద్యాబోధన చేయవచ్చన్నారు.



జియ్యమ్మవలస: అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచనలిస్తున్న ఎంఈవో శ్రీనివాసరావు



శిక్షణకు హాజరైన అంగన్‌వాడీ కార్యకర్తలు

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని ప్రకృతి వ్యవసాయం రీజనల్ టెక్నికల్ అధికారి జి.హేమసుందర్ అన్నారు. మండలంలోని ఖడ్గవలస, నాగూరు గ్రామాల్లో ప్రకృతి సేద్యం చేస్తున్న రైతులతో ఆయన మంగళవారం సమావేశమైన ఆయన.. ప్రకృతి సాగు ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. రానున్న ఖరీఫ్ సీజన్‌లో వరి పంట వేసే ముందు జూన్ తొలి వారంలో పొలాల్లో నవధాన్యాలు వేసి కలియదున్నడం ద్వారా నేలకు కావాల్సిన పోషకాలు అందుతాయన్నారు. ఆ తర్వాత వేసే ప్రధాన పంటకు ఎటువంటి తెగుళ్లు, చీడపీడలు సోకవన్నారు. రైతులు శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ప్రకృతి వ్యవసాయ విధానాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రకృతి సాగుకు ముందుకు వచ్చే రైతులకు ప్రభుత్వం కూడా ప్రోత్సాహకాలు అందిస్తోందన్నారు. ప్రకృతి సాగు పంటలు ఆరోగ్యవంతమైనవి, మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్నవన్నారు. కార్యక్రమంలో రైతులు ఎ.చంద్రశేఖర్, బి.సింహాచలం, జోగినాయుడు, రేగునాయుడు, ఎన్‌ఎఫ్‌ఏ జి.అన్నపూర్ణ, మండల ఇన్‌చార్జ్ వి.పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారి హేమసుందర్

ఆటపాటలతో కూడిన విద్యనందించాలి

గరుగుబిల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రీస్కూల్ ద్వారా చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలని ఎంపీడీవో జి.పైడితల్లి సూచించారు. మండలంలోని మరుపెంట పంచాయతీలోని టీఆర్ఎన్‌వలస అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె మంగళవారం సందర్శించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. చిన్నారుల ఆరోగ్యంతో పాటు వారి చదువుపైనా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం సక్రమంగా అందజేయాలన్నారు. అనంతరం గ్రామ రోడ్డులో ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా నాటుతున్న మొక్కలను ఆమె పరిశీలించి, మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ అని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు.



అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో పైడితల్లి

హెలిపాడ్ స్థల పరిశీలన



హెలిపాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ, పార్టీ ముఖ్యనాయకులు

పాలకొండ రూరల్/పాలకొండ: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పాలవలస రాజశేఖరం ఇటీవల మరణించిన సంగతి తెలిసిందే. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహనరెడ్డి ఈ నెల 20న పాలకొండకు రానున్నారు. ఇందులో భాగంగా హెలికాప్టర్ ల్యాండింగ్‌కు వీరఘట్టం రహదారిలోని రైస్ మిల్లు సమీపంలో ఇదివరకే సిద్ధం చేసిన స్థలాన్ని మంగళవారం రాత్రి ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌తోపాటు వైఎస్సార్ సీపీ నాయకులు పరిశీలించారు. జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలో పార్టీ నాయకులు, అభిమానులు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు పాల్గొనాలని ఎమ్మెల్సీతో పాటు మాజీ ఎమ్మెల్యే కళావతి కోరారు.

రేషన్ బియ్యం ఇవ్వడంలేదు..

పాలకొండ రూరల్:

మండలంలోని ఎల్‌ఎల్‌పురం గ్రామంలో రేషన్ బియ్యం అందించడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 40మందికి అందాల్సిన బియ్యం ఇవ్వకుండా రేషన్ బట్వాడా నిర్వాహకులు తాత్సారం చేస్తున్నారని వాపోతున్నారు. సోమవారం సాయంత్రం గ్రామానికి వచ్చిన రేషన్ బట్వాడా బండి వద్ద తాము ప్రశ్నించినప్పటికీ సరైన సమాధానం ఇవ్వలేదని ఆ ప్రాంత వాసులతో పాటు సర్పంచ్ ద్వారపూడి కుమార్ తదితరులు వాపోయారు. ఇదే విషయం పాలకొండ తహసీల్దార్ దృష్టికి వెళ్లామన్నారు. సంబంధిత అధికారులు స్పందించి అర్హులకు రేషన్ బియ్యం తక్షణమే అందించాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ కొనసాగించాలి

పాలకొండ: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ విధానం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. కేవీపీఎస్, సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ డివిజన్ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేపడుతున్న దుర్మార్గంపై ధ్వజమెత్తారు. గత ఐదేళ్లుగా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి ఉచిత విద్యుత్ అందించారని, ఈ ఐదేళ్లకు కలిపి కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు చెల్లించాలని ఎస్సీ, ఎస్టీలపై వత్తిడి తెస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీల సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించిన చంద్రబాబు దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వం 200 యూనిట్లు వరకు ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా అందించిందని తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం బిల్లులు చెల్లించలేని వారికి విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారని తెలిపారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రం డీఈఈకి అందించారు. కార్యక్రమంలో పలు సంఘాలకు చెందిన నాయకులు కాదరాము, దూసి దుర్గారావు, టి.పార్వతి, కె.ఆదినారాయణ, కె.స్వాతి తదితరులు పాల్గొన్నారు.



ఆందోళ చేస్తున్న విద్యుత్ వినియోగదారులు

శాస్త్రీయ సలహా మండలి సమావేశం

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం, సహ పరిశోధనా సంచాలకులు డాక్టర్ ఎ.అప్పలస్వామి ఆధ్వర్యంలో శాస్త్రీయ సలహా మండలి సమావేశం మంగళవారం జరిగింది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో కేవీకే ద్వారా చేపట్టే కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి, ప్రణాళికలు–వాటి అమలుపై చర్చించారు. వ్యవసాయ, ఉద్యాన, పాడి రంగాల్లో అభివృద్ధికి డాక్టర్ బి.ముకుందరావు సలహాలు, సూచనలు చేశారు. అలాగే ప్రకృతి సాగు, పాడి రైతులు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. సమావేశంలో కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ ధ్రువ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అప్పలస్వామి

జర్నలిస్టులపై దాడులు తగవు



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న మీడియా ప్రతినిధులు

కొమరాడ: మక్కువ మండల ప్రజాశక్తి విలేకరిపై దాడికి పాల్పడిన టీడీపీ నాయకుడు వేణుగోపాల్‌ను కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొల్లి సాంబమూర్తి, ఏపీ గిరిజన సంఘం నాయకుడు రామారావు, లక్ష్మయ్యలు డిమాండ్ చేశారు. ఇదే విషయమై వారు మండల కేంద్రంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. జర్నలిస్టులపై దాడులు సరికాదని, అది పత్రికా స్వేచ్ఛను హరించడమేనని ఖండించారు. భవిష్యత్‌లో ఇటువంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చట్టాలు చేసి అమలు చేయాలని కోరారు.

గుమ్మలక్ష్మీపురం(కురుపాం) : జర్నలిస్టులపై దాడులు తగవని కురుపాం మండల ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు ఖండించారు. పార్వతీపురం మన్యం జిల్లా, మక్కువ మండల ప్రజాశక్తి విలేకరిపై దాడికి పాల్పడిన టీడీపీ నాయకుడు గుల్ల వేణుగోపాల్‌ను తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఇదే విషయమై వారంతా కురుపాం తహసీల్దారు కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళనకు దిగారు. అనంతరం తహసీల్దారు రవణమ్మకు వినతిపత్రం అందజేశారు. పత్రికా స్వేచ్ఛను హరించాలనుకోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, ఢిల్లీశ్వరరావు, పృథ్వీ, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



కొమరాడ: మాట్లాడుతున్న సీపీఎం, గిరిజన సంఘాల నాయకులు

పూర్వ ప్రాథమిక విద్యనందించడమే లక్ష్యం

వీరఘట్టం: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యను అందించడమే లక్ష్యంగా జ్ఞానజ్యోతి శిక్షణా కార్యాక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ ఆర్.ఆనందరావు తెలిపారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో అంగన్‌వాడీలకు జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమం మంగళవారం ప్రారంభించారు. ఆరు రోజుల పాటు ఈ శిక్షణా కార్యక్రమం ఉంటుందన్నారు. పిల్లల్లో ఫండమెంటల్ లిటరసీ అండ్ న్యూమరసీ పెంపొందించడం, అక్షరాస్యత, సంఖ్యా భావనలు నేర్పించడం, పిల్లలకు సంతోషకరమైన, ఆరోగ్యకరమైన సానుకుల అభ్యసనా అనుభవాలు అందించడం, పిల్లల్లో శారీరక, మేధాభివృద్ధి, సామాజిక భావోద్వేగం, నైతిక అభివృద్ధి, సాంస్కృతిక అభివృద్ధిని అందించేందుకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలినారు. కార్యక్రమంలో డీఆర్‌పీలు మజ్జి పైడిరాజు, ఆర్.ధనుంజయనాయుడు, బి.రాజేష్, సూపర్‌వైజర్లు ఎస్.రాజశ్వేరి, జె.జ్ఞానమ్మ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న ఎంఈఓ ఆనందరావు

టెన్త్‌లో మంచి ఫలితాలు సాధించాలి

సీతంపేట: పదో తరగతిలో శతశాతం ఫలితాలు సాదించాలని ఐటీడీఏ ఏపీఓ జి.చిన్నబాబు అన్నారు. స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడారు. పదో తరగతి గదిని సందర్శించి విద్యార్థినులు ఎలా చదువుతున్నారో పరిశీలించారు. వివిధ సబ్జెక్టులకు సంబంధించి ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టించారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. పరీక్షలు ఎలా రాయాలి, ఒత్తిడికి గురికాకుండా ఏం చేయాలనేది వివరించారు. అనంతరం పాఠశాల పరిసరాలు పరిశీలించారు. ప్రహరీ నిర్మాణానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పెడతామన్నారు. తాగునీటి ఆర్‌ఓ ప్లాంట్ మరమ్మతులు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డీడీ అన్నదొర, హెచ్‌ఎం వసంత లక్ష్మి, హెచ్‌డబ్ల్యూఓ పాలక అమల తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఏపీఓ చిన్నబాబు

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాలకొండ / కురుపాం
9951602844, 9010204441
Office mail : vzmadvt@gmail.com